సాక్షి తిరుపతి
శనివారం । 1 । ఏప్రిల్ । 2023



భూసర్వే వేగవంతం

తిరుపతి అర్బన్: భూసర్వే వేగవంతం చేయాలని జేసీ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన డీఆర్వో శ్రీనివాసరావుతో కలిసి జిల్లా అధికారులతో సమావేశమయ్యారు.



శ్రీవారికి రూ.120.29 కోట్లు

తిరుమల: శ్రీవారికి మార్చి నెలలో రూ.120.29 కోట్లు హుండీ ఆదాయం వచ్చింది. కాగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.1,520.29 కోట్లు ఆదాయం లభించింది.



పెద్దకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పెద్దకొట్టాయి ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు.



	ఇఫ్తార్ శనివారం(సా)	సహర్ ఆదివారం(ఉ)
తిరుపతి	6.27	4.49
చిత్తూరు	6.30	4.49
పుంగనూరు	6.31	4.52

న్యూస్‌రీల్

పేద విద్యార్థులకు ఉచిత ప్రైవేటు విద్య

తిరుపతి అర్బన్: పేద విద్యార్థులకు ఉచితంగా ప్రైవేటు విద్యనందించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఏపీ విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1)(ఈ) మేరకు పేద విద్యార్థులకు ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1 వ తరగతిలో ఉచిత ప్రవేశానికి అవకాశం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 423 ప్రయివేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 4,230 మందికి అవకాశం లభిస్తోందని వివరించారు. అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

16 నుంచి వేసవి క్రికెట్ శిబిరం

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, పద్మావతిపురం జెడ్పీ హైస్కూల్లో ఏప్రిల్ 16 నుంచి జూన్ 4వ తేదీ వరకు బాల, బాలికలకు ప్రత్యేక వేసవి క్రికెట్ శిబిరాన్ని నిర్వహించనున్నట్టు శ్రీనివాస క్రికెట్ అకాడమీ హెడ్ కోచ్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ లెవల్ 'ఓ' కోచ్ వాసుదేవరెడ్డి తెలిపారు. శుక్రవారం పద్మావతిపురంలోని అకాడమీలో ఆయన విలేకరులతో మాట్లాడారు.రోజూ ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటలకు శిక్షణ ఉంటుందన్నారు. ఫ్లడ్ లైట్లలో ఆడే అనుభవం కోసం సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9505542601లో సంప్రదించాలని ఆయన కోరారు.

తిరుపతికి వచ్చిన వందేభారత్



తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న వందేభారత్ రైలు

తిరుపతి అర్బన్: చెన్నై నుంచి తిరుపతికి వందే భారత్ రైలు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు చేరుకుంది. 15 నిమిషాలపాటు ప్లాట్ ఫాంపై ఉన్న ఈ రైలు 3.15 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్‌కు వెళ్లింది. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు ట్రైన్ వద్ద ఫొటోలు దిగుతూ సందడి చేయడం కనిపించింది. ట్రయల్ రన్‌లో భాగంగా తిరుపతికి వచ్చిందని, సికింద్రాబాద్‌కు రాత్రి 11.45 గంటలకు చేరుకుంటుందని రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ నెల 10వ తేదీలోపు ఈ ట్రైన్ తిరుపతి–సికింద్రాబాద్ మార్గంలో ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. 130–150 కిలోమీటర్ల వేగంతో ఈ ట్రైన్ నడవనుంది.

మూడు రోజులు ఎండలు అధికం

తిరుపతి అర్బన్: రానున్న మూడు రోజుల పాటు జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ మేరకు పిల్లలు, వృద్ధులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 34 డిగ్రీల నుంచి 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉంటుందని వెల్లడించారు. ప్రధానంగా ఓజిలి, దొరవారిసత్రం, నాయుడుపేట, గూడూరు, పెళ్లకూరు, తొట్టంబేడు మండలాల్లో 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశాలున్నట్లు తెలిపారు.

అంబులెన్స్ వితరణ



అంబులెన్స్‌ను అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయానికి కరూరు వైశ్యాబ్యాంకు అధికారులు శుక్రవారం రూ.10 లక్షల విలువైన అంబులెన్స్‌తో పాటు నాలుగు వీల్‌చైర్స్‌ను అందజేశారు. వీటిని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులకు అందజేశారు. అనంతరం బ్యాంకు అధికారులను ఘనంగా సన్మానించారు. బ్యాంకు అధికారులు నరేంద్రగుప్తా, వీరాంజనేయులు, పట్టణ ప్రముఖులు సురేష్, కొత్త సురేష్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

పరిశోధించు.. ఆవిష్కరించు!



'గతంకంటే భిన్నంగా తిరుత్సవ్ వేడుకలు నిర్వహిస్తున్నాం. విజ్ఞానం, సాంకేతికత మేళవించిన పలు టెక్నో ఈవెంట్లు కూడా నిర్వహిస్తున్నాం. ఐఐటీ విద్యార్థులే కాకుండా దేశంలోని ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీల నుంచి విద్యార్థులను ఆహ్వానించాం. అందరికీ విజ్ఞానం పంచాలనే సదుద్దేశంతో నూతన ఆవిష్కరణలకు ఆస్కారం కల్పించాం. ఈవెంట్లు, ప్రోషోలకు భారీ ప్రైజ్‌మనీ అందిస్తున్నాం' అని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్ సత్యనారాయణ తెలిపారు. తిరుత్సవ్ -2023లో భాగంగా మొదటి రోజు శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన విద్యార్థులు ఆటపాటలు, ఈవెంట్లతో విశేషంగా ఆకట్టుకున్నారు.

- అట్టహాసంగా తిరుత్సవ్-2023 వేడుకలు
- మూడు వేల మంది విద్యార్థులు హాజరు
- అఫీషియల్ లోగో కృష్ణ జింక
- టెక్నో ఫెస్ట్ వేడుకల్లో ఐఐటీ డైరెక్టర్ వెల్లడి



తిరుత్సవ్-2023 అఫీషియల్ లోగో కృష్ణ జింక



తిరుత్సవ్ వేడుకలు ప్రారంభిస్తున్న ఐఐటీ డైరెక్టర్



సర్టిఫికెట్లు అందుకుంటున్న విజేతలు

రేణిగుంట, ఏర్పేడు: ప్రపంచ దేశాల్లో భారతావనిని అగ్రగామిగా నిలపడంలో శాస్త్ర,సాంకేతిక రంగాలదే ప్రధాన భూమిక అని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్ సత్యనారాయణ తెలిపారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో శుక్రవారం తిరుత్సవ్-2023 టెక్నో ఫెస్ట్ వేడుల ప్రారంభ సభ జరిగింది. ఈ ఏడాది తిరుత్సవ్ అఫీషియల్ లోగోగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జంతువు కృష్ణజింక చిత్రంతో కూడిన చిత్రాలను ఐఐటీ క్యాంపస్‌లో ప్రదర్శించారు. తిరుపతి ఐఐటీలో వినోదంతోపాటు విజ్ఞానాన్ని అందించే లక్ష్యంతో 2018 నుంచి తిరుత్సవ్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే కరోనా పరిస్థితుల వల్ల రెండేళ్లు ఆన్‌లైన్‌లో ఉత్సవానికి సంబంధించిన కార్యక్రమాలు జరిగాయని, విద్యార్థులు ఆన్‌లైన్‌లో జరిగిన ఈవెంట్లలో పాల్గొన్నారని గుర్తుచేశారు.

ఈ ఏడాది భారీ ఏర్పాట్లు

ఈ ఏడాది తిరుత్సవ్ సంబరాలకు భారీ ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. వినోదం అందించే కార్యక్రమంగా ఈ ఉత్సవాన్ని చూడలేమని, విజ్ఞానం, సాంకేతికత మేళవించిన పలు టెక్నో ఈవెంట్లు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు వేల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇతర కళాశాలల నుంచి వచ్చే విద్యార్థులు ఇక్కడ బస చేసేందుకు, మూడు రోజుల ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఐఐటీ క్యాంపస్‌లో వసతులు గతంతో పోలిస్తే పెరిగాయన్నారు. అమరరాజ బ్యాటరీస్ న్యూ ఎనర్జీ స్టోరేజ్ ల్యాబ్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ ఎం.జగదీష్ మాట్లాడుతూ ఆవిష్కరణలతోపాటు సృజనాత్మకత అవసరమన్నారు. క్రిండల్ ప్రిన్సిపల్ డేటా సైంటిస్ట్ డాక్టర్ షీలా తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఆట..పాట అదుర్స్



తిరుత్సవ్‌లో ఆట..పాట

తిరుపతి ఐఐటీలో తిరుత్సవ్-2023 వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు సాగే ఈ వేడుకల్లో మొదటి రోజు శుక్రవారం టెక్నో ఫెస్ట్‌లో విద్యార్థులు మమేకమయ్యారు. ట్రీసర్ హంట్ పేరుతో రూపొందించిన వర్క్‌షాప్‌లను ప్రదర్శించారు. సాంకేతిక మేళవింపుతో చేపట్టిన వినోదాత్మక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. స్పాట్ లైట్ (ఫ్యాషన్ షో)- రౌండ్-1లో విద్యార్థులు ర్యాంప్‌వాక్ చేస్తూ ఆకట్టుకున్నారు. విభిన్న సంస్కృతులకు నిలయమైన భారతావనిలో మన సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను వివరించారు. 'వన్ ఆన్' పేరుతో చేపట్టిన సోలో డ్యాన్స్ కార్యక్రమం వీక్షకులను అలరించింది. 'లె చెఫ్' పాకశాస్త్ర రంగంలో విద్యార్థుల ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తూ పలు రకాల వంటకాలను తయారు చేసి చూపారు. 'ర్యాప్సోడీ' పేరుతో సాగిన ఈవెంట్‌లో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. బ్రిడ్జ్ బజూకా పేరుతో జరిగిన టెక్నికల్ ఈవెంట్‌లో వంతెన నిర్మాణంలో మేళవించాల్సిన సాంకేతిక విధానాలను ప్రస్తావించారు. అలాగే రాత్రి స్టేజ్ వద్ద గ్రూప్ డ్యాన్స్ కార్యక్రమంలో ఐఐటీ విద్యార్థులు ఉప్పొంగిన ఉత్సాహంతో ఆకాశమే హద్దుగా మైమరిచి నృత్యాలు చేశారు. డీజే సౌండ్ తోడవడంతో ఆద్యంతం ఉత్సాహంగా డ్యాన్స్ కార్యక్రమాలు జరిగాయి.

తిరుత్సవ్-2023లో నేడు

ఐఐటీ తిరుత్సవ్ కార్యక్రమాల్లో భాగంగా శనివారం 'క్రికెట్ ఓ మానియా' పేరిట 8 జట్ల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. క్రైమ్ బస్టర్స్ పేరుతో సాగే మిస్టరీ కేసులను ఛేదించే ఈవెంట్, నిమిషం పాటు మాట్లాడే ఒరాటరీ స్కిల్స్ టెస్టింగ్ ఈవెంట్, వివిధ వైజ్ఞానిక ఆటలతో కూడిన ఏస్ ఆఫ్ బార్డర్‌ల్యాండ్, పాయిట్రీ ఈవెంట్, స్పాట్ లైట్(ఫ్యాషన్ షో) ఫైనల్ రౌండ్, రాత్రి ఇండియన్ ప్లేబ్యాక్ సింగర్ నిఖిత గాంధీ ప్రో- షో కార్యక్రమాలు ఆకట్టుకోనున్నాయి.

ఆయుర్వేద ఫార్మసీకి పెద్దపీట



ఆయుర్వేద ఫార్మసీలో నూతన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, జేఈఓ

- ఔషధ ఉత్పత్తుల నూతన కేంద్రం ప్రారంభం
- భవిష్యత్‌లో 314 రకాల ఔషధాలు తయారు చేస్తాం
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వెల్లడి

చంద్రగిరి: నరసింగాపురంలోని శ్రీవేంకటేశ్వర ఆయుర్వేద ఫార్మసీలో నూతనంగా నిర్మించిన ఔషధ ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని శుక్రవారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ఏవీ. ధర్మారెడ్డి ప్రారంభించారు. అర్చకులు శాస్త్రోక్తకంగా పూజలు నిర్వహించిన అనంతరం చైర్మన్, ఈఓ నూతన భవనంతో పాటు మందుల ఉత్పత్తిని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ప్రాచీన ఆయుర్వేద వైద్యాన్ని అభివృద్ధి చేయడానికి టీటీడీ కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే 1983లో ఆయుర్వేద వైద్య కళాశాలను, దానికి అనుబంధంగా ఆయుర్వేద ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయుర్వేద ఆస్పత్రికి అవసరమయ్యే మందులు సొంతంగా తయారు చేసుకోవడానికి నరసింగాపురంలో 1990లో 14.75 ఎకరాల్లో టీటీడీ ఆయుర్వేద ఫార్మసీని ఏర్పాటు చేసిందన్నారు. ఈ ఫార్మసీ క్రమేణా 80 రకాల మందులు తయారు చేసి ఆయుర్వేద ఆస్పత్రితో పాటు తిరుపతి, తిరుమలలో డిస్పెన్సరీలకు సరఫరా చేస్తోందని తెలిపారు. ఫార్మసీ భవనాలను ఆధునీకరించడంతో పాటు మూడు ఔషధ ఉత్పత్తుల కేంద్రాలను నిర్మించి రూ.3.9కోట్లతో అధునాతన యంత్ర పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో మొదట విడతగా తొలి ఔషధ ఉత్పత్తి కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు చైర్మన్ వివరించారు. ఏడాదికి రూ.5కోట్ల విలువ చేసే మందులను తయారు చేస సామర్థ్యం లభిస్తుందన్నారు. ఇక్కడ తయారు చేసే ఆయుర్వేద మందులను టీటీడీ అవసరాలకు పోను, మిగిలినవి ఆయుష్ వైద్యశాలలకు విక్రయించేలా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం జరిగిందన్నారు. ఉత్పత్తి కేంద్రంలో మొదట విడతగా 10 రకాల ఔషధాలు తయారు చేస్తారన్నారు. భవిష్యత్‌లో 314 రకాల నూతన ఔషధాలు తయారు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. జేఈఓ సదాభార్గవి ఆధ్వర్యంలో నిర్వహించిన చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేణుదీక్షిత్, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుందరం, ఈఈ మురళీకృష్ణ, వీజీఓ మనోహర్, ఆయుర్వేద ఫార్మసీ సాంకేతిక అధికారి డాక్టర్ నారప్పరెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో అభివృద్ధి పరుగులు

- ప్రభుత్వ చొరవతో అందుబాటులోకి అన్ని సేవలు
- సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు ఏటా రూ.2,378 కోట్లు
- స్పందన వినతుల పరిష్కారంలో ముందు వరుసలో తిరుపతి
- ఈనెల 15న 15వేల కొత్త ఇళ్లకు గృహప్రవేశాలు
- 'సాక్షి'తో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

సాక్షి, తిరుపతి: మూడున్నరేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు అభివృద్ధి.. మరో వైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు అవసరమైన అన్ని సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. సచివాలయాల ఏర్పాటు ద్వారా ఉన్న ఊర్లోనే ప్రజలు అన్ని ప్రభుత్వ సేవలు పొందుతున్నారు. సంక్షేమ పథకాల ద్వారా అనేక మంది మహిళలను మహారాణులను చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. పలు పథకాల ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తోంది. ప్రభుత్వం నుంచి అందుకున్న నగదుతో వివిధ వ్యాపారాలు ఆరంభించి ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నారు. తిరుపతి కొత్త జిల్లాగా ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా కలెక్టర్ వెంకటరమణారెడ్డితో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

సాక్షి: సంక్షేమ పథకాల ద్వారా ఎంత మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోంది?

కలెక్టర్: అమ్మ ఒడి, రైతు భరోసా, సున్నావడ్డీ, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పెన్షన్ కానుక, వైఎస్సార్ బీమా, చేయూత, ఆసరా, విద్యాకానుక, వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ లా నేస్తం వంటి అనేక సంక్షేమ పథకాలకు సంబంధించి 24,42,699 మంది లబ్ధిదారులకు ఏటా రూ.2,378 కోట్లు నేరుగా వారి బ్యాంక్ అకౌంట్లలో ప్రభుత్వం జమచేస్తోంది.

సాక్షి: రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇచ్చారా?

కలెక్టర్: ఈ ఏడాదిలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు గ్రూపులకు రూ.31 కోట్ల విలువచేసే ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, సబ్సిడీ విత్తనాలు, సబ్సిడీ ఎరువులు పంపిణీ చేశాం.

సాక్షి: స్పందనలో వచ్చిన వినతుల్లో ఎన్ని పరిష్కరించారు?

కలెక్టర్: ప్రతి వారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి ఇప్పటి వరకు 12,426 వినతులు వచ్చాయి. అందులో 10,464 పరిష్కరించాం.

సాక్షి: నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్లు పథకం పురోగతి ఎలా ఉంది?

కలెక్టర్: జిల్లాలో 73,723 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కాగృహాలు నిర్మిస్తున్నాం. ప్రస్తుతం 14 వేలకు పైగా గృహాలు పూర్తి చేశాం. మిగిలిన పక్కాగృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఈనెల 15న 15వేల ఇళ్లలో గృహప్రవేశాలు నిర్వహించనున్నాం. ప్రస్తుతం మరో ఎనిమిది వేల ఇళ్లు మంజూరయ్యాయి.

సాక్షి: అభివృద్ధి పనుల పురోగతి ఎలా ఉంది?

కలెక్టర్: జిల్లాలోని గ్రామ సచివాలయాలకు సంబంధించి 206 భవనాలు పూర్తిచేశాం. మరో 264 వివిధ దశల్లో నిర్మాణాలు సాగుతున్నాయి. 139 రైతు భరోసా కేంద్రాలు, 67 హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలు పూర్తిచేశాం. నాడు–నేడు ద్వారా మొదటి విడతలో 1,070 పాఠశాలలు పూర్తి చేశాం. రెండవ విడతలో రూ.107 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు రూ.70 కోట్లు ఖర్చుచేశాం.

సాక్షి: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మంజూరైన నిధులతో ఏమి చేస్తున్నారు?

కలెక్టర్: రూ.53 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో 1,557 పనులు చేపట్టాం. ఇందులో 1,420 పనులు పూర్తి చేశాం.

సాక్షి: రీ సర్వే ఎంత వరకు వచ్చింది?

కలెక్టర్: మొదటి విడతలో 69 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశాం. ఆ గ్రామాల్లో రిజిస్ట్రేషన్లకు వెళ్తున్నాం. రెండవ విడతలో 208 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాం. త్వరలో పూర్తిచేసి రిజిస్ట్రేషన్లకు వెళ్తాం.

సాక్షి: జాబ్ మేళా ద్వారా ఎంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు?

కలెక్టర్: స్కిల్ డవలప్‌మెంట్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాం. ఈ ఏడాదిలో వేలాది మందికి ఉద్యోగాలు కల్పించాం. స్కిల్ కళాశాలల ద్వారా 15,438 మందికి శిక్షణ ఇప్పించాం.

సాక్షి: కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు అవకాశాలు కల్పించారా?

కలెక్టర్: ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ప్రవేశాలు కల్పించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అందులో భాగంగా జిల్లాలో 423 కార్పొరేట్ పాఠశాలల్లో 4,230 మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యావకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం.

జగనన్న ఆదేశం పాటించేందుకు వెళ్తున్నా



పాకాలలో బహిరంగ సభలో మోహిత్‌రెడ్డిని పరిచయం చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

తిరుపతి రూరల్ : "2024 ఎన్నికల ప్రణాళిక, నిర్వాహణ, వైఎస్సార్‌సీపీకి చెందిన 23 అనుబంధ సంఘాల రాష్ట్ర ఇన్‌చార్జిగా గ్రామస్థాయి నుంచి వాటిని పటిష్టం చేయడం, పార్టీ వ్యవహారాల్లో వెన్నంటి ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఆదేశించారు. వైఎస్ కుటుంబంతో మూడు తరాలుగా ఉన్న అనుబంధంతో ఆయన అప్పగించిన ఆదేశాలను శిరసావహిస్తూ వెళ్తున్నా.. అంతేకాక, ప్రాణంగా ప్రేమించే చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు సేవచేసే అవకాశం నా బిడ్డ మోహిత్‌రెడ్డికి జగనన్న కల్పించారు. నన్ను ఆశీర్వదించినట్లే మోహిత్‌రెడ్డిని కూడా ఆశీర్వదించండి".. అని చంద్రగిరి ఎమ్మెల్యే, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం పాకాల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో ఏర్పాటుచేసిన సభల్లో చెవిరెడ్డి మాట్లాడారు. తనను సొంత బిడ్డలా ఆశీర్వదించిన చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు తన కుటుంబం ఎప్పుడూ రుణపడి ఉంటుందన్నారు. కన్నతల్లిలాంటి నియోజకవర్గం ప్రజలకు సేవ చేసేందుకు తన బిడ్డను కూడా ఆశీర్వదించాలని ఆయన కోరారు. తనకు ఒక కన్ను కుటుంబమైతే.. మరో కన్ను నియోజకవర్గ ప్రజలని చెప్పారు. అందుకే తమ కుటుంబం సంపాదించిన ప్రతి రూపాయిలో 75శాతం నియోజకవర్గ ప్రజలకే ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. కుటుంబానికి ఎంత ప్రాధాన్యత ఇస్తామో, అంతకంటే ఎక్కువ ప్రాధాన్యత నియోజకవర్గ అభివృద్ధికి.. ఆదరించి, ఆశీర్వదించిన ప్రజల సంక్షేమం కోసం ఇవ్వాలని మోహిత్‌రెడ్డికి సూచించినట్లు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చెప్పారు. అదేవిధంగా ముఖ్యమంత్రి వెన్నంటి ఉండడం వల్ల నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు సాధించి, ఇద్దరం కలసి మనసా.. వాచా.. కర్మణా.. అభివృద్ధిలో అందరికీ ఆదర్శంగా మన చంద్రగిరి నియోజకవర్గాన్ని తయారుచేస్తామని పేర్కొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపండి



మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైమ్ : జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అమలు చేయాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఎన్‌డీపీఎస్ కేసులపై జిల్లా అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గంజాయి నిర్మూలనకు పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సంయుక్తంగా కార్యాచరణ రూపొందించి పూర్తిస్థాయిలో నిర్మూలించాలన్నారు. క్రిమినల్ కేసులతో పాటు పీడీ యాక్ట్ కేసులు కూడా నమోదు చేయాలన్నారు. ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, మునిరామయ్య, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాజేంద్ర ఎక్సైజ్ సూపరింటెండెంట్ స్వాతి పాల్గొన్నారు.

ముగ్గురికి కోవిడ్ నిర్ధారణ

తిరుపతి తుడా: రామకుప్పం మండలానికి చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురికి కోవిడ్ సోకినట్లు తిరుపతి రుయా వైద్యులు శుక్రవారం నిర్ధారించారు. రామకుప్పానికి చెందిన ఓ యువకుడికి బుధవారం కోవిడ్ లక్షణాలు ఉండడంతో స్థానిక పీహెచ్‌సీలో ర్యాపిడ్ పరీక్ష నిర్వహించారు. పాజిటివ్ వచ్చింది. మరుసటి రోజు అతని తల్లి, అత్తకు కూడా లక్షణాలు ఉండడంతో ర్యాపిడ్ టెస్ట్ చేశారు. వారికి కూడా పాజిటివ్ వచ్చింది. ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించిన తర్వాత వచ్చే ఫలితాలను బట్టి కచ్చితంగా నిర్ధారిస్తారు. ఈ క్రమంలో ఆ ముగ్గురి శాంపిల్స్‌ను తీసి వైద్యులు తిరుపతిలోని స్విమ్స్‌కు పంపారు. ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించారు. ఆమేరకు వారి ముగ్గురికీ కోవిడ్ నిర్ధారణయ్యింది.



చంద్రగిరి నియోజకవర్గం, పాకాలలో ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



నాగలాపురం: ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం



తిరుపతి : సీఎం వైఎస్‌ జగన్‌ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే భూమన



రాపూరు: గొర్రెపిల్లలు పంపిణీ చేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



శ్రీకాళహస్తి: ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



గూడూరు : ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



తడ: సీఎం జగన్‌ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తోబుట్టువుకు 'ఆసరా'

జిల్లాలో ఆసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి నియోజకవర్గంలో అక్కచెల్లెమ్మలు తండోపతండాలుగా తరలివచ్చారు. ఆసరా మెగా చెక్కులు అందుకుని ఆనందం పంచుకున్నారు. తోబుట్టువుగా ఆదుకుని, ఆసరానిస్తున్న ముఖ్యమంత్రి జగనన్న కలకాలం తమతోనే ఉండాలని ఆకాంక్షించారు. ఆయన నిండు నూరేళ్లూ వర్ధిల్లాలని దీవెనలందించారు.

తుమ్మలగుంటలో వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



పట్టాభిషేక మహోత్సవంలో అర్చకులు



హారతి అందుకుంటున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు

తిరుపతి రూరల్‌: తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామ నవమి రోజు కల్యాణం, దశమి రోజున శ్రీరామ పట్టాభిషేకం జరిపించడం ఆనవాయితీ. చైత్రశుద్ధ దశమిని ధర్మరాజు దశమి, శాలివాహన జయంతి అనే పేర్లతోనూ పిలుస్తారు. ఈ రోజున శ్రీరామ నామస్మరణ చేస్తే మన మనసుకు ఆయనే రాజు అనే భావన స్థిరపడుతుంది. ఆలయం ముందు ఏర్పాటు చేసిన మండపంలో శ్రీరామ పట్టాభిషేకం కనుల పండుగా నిర్వహించారు. సీతా సమేతంగా శ్రీరాముడికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామ అర్చన నిర్వహించారు. అనంతరం రాజదండం, రాజఖడ్గం, రాజముద్రిక ఒక్కొక్కటిగా స్వామివారికి అలంకరించారు. శ్రీరామచంద్రుని గుణగణాలతో పాటుగా శ్రీరామరాజ్యం వైభవాన్ని వేదపండితులు వివరించారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు పట్టాభిషేకం మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పిల్లల సామర్థ్యాలను ప్రోత్సహించాలి





జిల్లా కలెక్టర్‌, ఎస్వీయూ వీసీలను సత్కరిస్తున్న అకార్డ్‌ స్కూల్‌ చైర్మన్‌ చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు , క్రికెట్‌ పోటీలకు ఎంపికైన ముచ్చెలి హర్షవర్ధన్‌రెడ్డిని అభినందిస్తున్న డైరెక్టర్లు

తిరుపతి రూరల్‌: పిల్లల సామర్థ్యాన్ని బట్టి ఏ రంగంలో రాణించగలుగుతారో గమనించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించి, దేశానికి యువతను ఒక ఆస్తిగా తీర్చిదిద్దాలని కలెక్టర్‌ వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చిగురువాడలోని అకార్డ్‌ స్కూల్‌ డే సందర్భంగా కలెక్టర్‌ ముఖ్యఅతిథిగా, ఎస్వీ యూనివర్సిటీ వీసీ రాజారెడ్డి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ చదువుతున్న పిల్లల్లో ప్రతిభను గమనించి ప్రోత్సహించాలన్నారు. విశాలమైన క్యాంపస్‌ కలిగి ఉన్న అకార్డ్‌ స్కూల్‌ 10 ఎకరాలలో ఉండడం, ఇక్కడ చదువుతున్న పిల్లలు అదృష్టవంతులని, ల్యాబ్‌, క్రీడల ప్రోత్సాహం వంటి సదుపాయాలు ఉండడం ఆనందంగా ఉందన్నారు. చదువుతో పాటు శారీరక, మానసిక అభివృద్ధి అవసరమన్నారు. పిల్లలు 20 సంవత్సరాలు కష్టపడి చదివితే, జీవితాంతం సుఖంతో ఉండి, దేశాభివృద్ధికి, సమాజానికి ఉపయోగపడతారని చెప్పారు. ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్‌ రాజారెడ్డి మాట్లాడుతూ చదువుతోనే ఉన్నత విలువలు వస్తాయన్నారు. వార్షికోత్సవం సందర్భంగా వివిధ పోటీలలో ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. స్కూల్‌ గేమ్స్‌ జాతీయ స్థాయి క్రికెట్‌లకు ఎంపికైన స్కూలు విద్యార్థి ముచ్చెలి. హర్షవర్ధన్‌ రెడ్డికి ప్రత్యేకంగా సన్మానం చేశారు. విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రశాంత్‌, వివేక్‌, నీరజ్‌, తల్లిదండ్రులు పాల్గొన్నారు



తిరుపతి బులియన్‌

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,650
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,507

వెండి:

హోల్‌సేల్‌ ధర (కిలో)	రూ.73,600
రిటైల్‌ వెండి గ్రాము	రూ.75.60

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	25
తిరుమల	31	19
చిత్తూరు	37	24
గూడూరు	38	27
నగరి	37	26

సమాజసేవ, పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



మిస్‌ ఇండియా ఐకాన్‌ దియా–2023 టైటిల్‌తో భావన



తల్లిదండ్రులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతున్న భావన

- మిస్‌ ఇండియా ఐకాన్‌ దియా–2023 విన్నర్‌ భావన

చంద్రగిరి: భవిష్యత్తులో సమాజ సేవతో పాటు పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా అడుగులు వేయనున్నట్లు మిస్‌ ఇండియా ఐకాన్‌ దియా–2023 విన్నర్‌ భావన తెలిపారు. శుక్రవారం ఆమె తన నివాసంలో తల్లిదండ్రులు గోపీకృష్ణ, లక్ష్మితో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ వెదురుకుప్పం మండలం, పాతగుంట గ్రామంలో జన్మించిన తాను అక్కడే ప్రాథమిక విద్యనభ్యసించినట్టు తెలిపారు. ఆ తర్వాత చంద్రగిరిలోకి వచ్చి స్థిరపడినట్టు వెల్లడించారు. చిన్నతనం నుంచి మోడలింగ్‌పై ఉన్న ఆసక్తి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ద్వారా మోడల్‌ రంగంలో పలు రన్‌వే షోలలో పాల్గొన్నట్టు తెలిపారు. ఈ క్రమంలో మిసెస్‌ ఇండియా రైజింగ్‌ స్టార్‌ డాక్టర్‌ సుప్రజా చౌదరి అనంతరపురంలో నిర్వహించిన రన్‌వే షోలో పాల్గొని, మిస్‌ ఫ్యాషన్‌ ఐకాన్‌గా నిలిచానన్నారు. జాతీయ స్థాయిలో కేజేఎం డ్రీమ్స్‌ సంస్థ నిర్వాహకులు కవితా కిషోర్‌, రియాన్‌శర్మ నిర్వహించిన మిస్‌ ఇండియా పోటీల ఆడిషన్‌లో పాల్గొని టాప్‌ 20లో నిలిచినట్లు తెలిపారు. తర్వాత ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగిన ఫైనల్స్‌లో మిస్‌ ఇండియా ఐకాన్‌ దియా–2023 విన్నర్‌గా నిలవడం ఆనందాన్నిచ్చిందని తెలిపారు.

సైబర్‌ నేరగాళ్లతో అప్రమత్తం

తిరుపతి క్రైమ్‌: సైబర్‌ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో వాట్సాప్‌ ద్వారా కొత్తరకం మోసాలను వివరించారు. తిరుపతి యూనివర్సిటీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శేఖర్‌ చాటింగ్‌ చేస్తూ ఉండగా ఒక కొత్త నంబర్‌ నుంచి మెసేజ్‌ వచ్చింది. తాను ఒక సంస్థలో ఉద్యోగం చేస్తున్నానని, గూగుల్‌ పే ఉంటే నేను పెట్టిన మెసేజ్‌కి మీరు రేటింగ్‌ ఇచ్చి దానిని స్క్రీన్‌ షాట్‌ తీసి పంపిస్తే కమీషన్‌ రూపంలో నగదు అకౌంట్‌కు వస్తుందని నమ్మబలికారు. తర్వాత తనకి రూ.150 కమీషన్‌ పంపించాడు. ఇలా పూర్తిగా ముగ్గులోకి దింపిన సైబర్‌ నేరగాళ్లు అతని నుంచి రూ.30 వేలు, రూ.63,900, రూ.80 వేలు, రూ.90,000లు ఇలా కొద్దికొద్దిగా మొత్తం రూ.2,63,900 గుంజేశారు.

వెంటనే తేరుకున్న బాధితుడు తిరుపతి సైబర్‌ పోలీసులను ఆశ్రయించాడు. విచారణలో తమిళనాడు రాష్ట్రం మదురై జిల్లాకు చెందిన వ్యక్తి, అతని యాక్సిస్‌ బ్యాంక్‌ అకౌంట్‌ ఇప్పటికే 12 పర్యాయాలు ఫ్రీజ్‌ చేసి ఉందని, వెంటనే సంబంధిత బ్యాంక్‌ అధికారులను సంప్రదించి అకౌంట్లను కూడా ఫ్రీజ్‌ చేయించారు. సీఐ రవీంద్రనాథ్‌ ఆధ్వర్యంలో ప్రత్యేక సైబర్‌ పోలీస్‌ బృందం తమిళనాడు రాష్ట్రం మధురై వెళ్లి గురువారం ముద్దాయిని అరెస్టు చేశారు. బాధితుడికి రూ.2,63,900 నగదు రీఫండ్‌ చేసే విధంగా సైబర్‌ ల్యాబ్‌ పోలీసులు చర్యలు చేపట్టారు. ఇలాంటి మోసాలు జరిగితే బాధితులు టోల్‌ ఫ్రీ నం.1930కి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



ఆలయం వెలుపల జస్టిస్‌ డీవీఎస్‌ఎస్‌ సోమయాజులు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ వి.సుజాత

తిరుమల: ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్‌ డీవీఎస్‌ఎస్‌ సోమయాజులు, జస్టిస్‌ వి.సుజాత శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమల చేరుకున్న న్యాయమూర్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

రక్షణ కల్పించండి



ఎస్‌ఐతో మాట్లాడుతున్న దిశ చైర్‌పర్సన్‌ అరుణ

చిల్లకూరు: ప్రేమ జంటకు రక్షణ కల్పించాలని చిల్లకూరు పోలీసులకు దిశ ఫౌండేషన్‌ రాష్ట్ర చైర్‌పర్సన్‌ నిడిగుంట అరుణ సూచించారు. ఆమె వివరాలకు చిల్లకూరులోని మిక్సెడ్‌ కాలనీకి చెందిన మనోజ్‌ ప్రవేటు ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో అతనికి అన్నమయ్య జిల్లా, పీలేరుకు చెందిన యువతితో ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. అయితే ఇద్దరి కులాలు వేరు కావడంతో వారి తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించలేదు. దీంతో వారు నెల్లూరులోని దిశ ఫౌండేషన్‌ చైర్‌పర్సన్‌ను కలిసి వివరాలు తెలియజేశారు. వారు ఇరువురూ మేజర్లు కావడంతో నెల్లూరులోని వేణుగోపాల్‌ స్వామి సన్నిధిలో వివాహం జరిపించి నేరుగా చిల్లకూరు ఎస్‌ఐ గోపాల్‌కు అప్పగించారు. రెండు కుటుంబాల పెద్దల నుంచి వారికి రక్షణ కల్పించాలని ఎస్‌ఐని కోరారు.

వివాహ రిసెప్షన్‌కు వెళ్లివస్తూ తిరిగిరాని లోకాలకు

- ఆటోను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం
- ఇద్దరు అక్కడికక్కడే మృతి
- మరో ఐదుగిరుకి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన ఇమ్రాన్‌, దినేష్‌ (ఫైల్‌)



ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

చంద్రగిరి: వివాహ వేడుకలకు హాజరై తిరిగి వస్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం షేర్‌ ఆటోను ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి తూర్పుపల్లి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... సదుంకు చెందిన అమర్‌నాథ్‌ కరకంబాడి సమీపంలోని ఓ ప్రయివేటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. అతనికి వివాహం నిశ్చయం కావడంతో గురువారం రాత్రి రిసెప్షన్‌కు హాజరయ్యేందుకు తన స్నేహితుడు శ్రీనివాసులు షేర్‌ ఆటోను తీసుకుని, ఫ్యాక్టరీలో పని చేసే తోటి స్నేహితులు ఇమ్రాన్‌(23), దినేష్‌(24), పృథ్వీ, జయచంద్రారెడ్డి, నాయుడు, విశ్వనాథ్‌, విజయ్‌రెడ్డితో కలిసి సదుంకు బయల్దేరారు. రిసెప్షన్‌ చూసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి తూర్పుపల్లి వద్ద రహదారి పనులు పూర్తి కాకపోవడంతో ఎటువెళ్లాలో తెలియక రాంగ్‌రూట్‌లో చంద్రగిరి వైపు వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం షేర్‌ ఆటోను ఢీకొనడంతో ఇమ్రాన్‌, దినేష్‌ అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న విశ్వనాథ్‌ మాత్రం క్షేమంగా బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనంలో క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అధికారుల అలసత్వంతోనే రోడ్డు ప్రమాదాలు

పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణ పనులను అధికారులు దాదాపు 90శాతం పూర్తి చేశారు. పనపాకం వద్ద స్థానికులు నష్టపరిహారం విషయంలో న్యాయం జరగకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు తాత్కాలికంగా ఆగిపోయాయి. బెంగళూరు వైపు నుంచి తిరుపతి వెళ్లే మార్గంలో పనపాకం నుంచి తూర్పుపల్లి వరకు రోడ్డు పనులు జరగలేదు. విషయం తెలియని ప్రయాణికులు వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో రోడ్డు ప్రమాదలో చోటు చేసుకుని మృత్యువాత పడ్డారు. పనులు ఆగిపోయిన ప్రాంతంలో సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. టోల్‌గేట్‌తో రుసుములు వసూళు చేసుకుంటున్నారే తప్ప సురక్షిత ప్రయాణానికి కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.